# శ్రీ మహేశ్వర వ్రతం

సాక్షాత్తూ శ్రీ స్వామి వారిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి



ఓం తత్పురుషాయ విద్మహే
మహాదేవాయ ధీమహి
తన్నో రుద్రః ప్రచోదయాత్

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

# శ్రీ మహేశ్వర వ్రతం

సాక్షాత్తూ శ్రీ స్వామి వారిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము




తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి



శ్రీ డిజైన్స్

www.lordofsevenhills.com

Phone : 040 - 23833752

హైదరాబాదు

2014

# శ్రీ మహేశ్వర వ్రతం

**సాక్షాత్తూ శ్రీ స్వామి వారిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతకల్పము**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

© **సర్వహక్కులు రచయితవి.**

First Edition : 2014

**వెల : అమూల్యం**

**కాపీలకు**
**"Viswapathi"**
**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No. 202, Plot No. 32,
Srikar's Ravi Residency,
Beside Nalanda High School,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, India.
Ph : 040 - 23833752.
Cell : 98494 43752
Website : www.lordofsevenhills.com
Email: viswapathi@yahoo.com
shridesigns@gmail.com

Designed & Printed at :
**SRI VASAVI PRINTERS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.

# నివేదన

బ్రహ్మమురారి సురార్చిత లింగం
నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజదుఃఖ వినాశన లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

శ్రీ పరమేశ్వరుడు కళ్యాణ స్వరూపుడు. ఆ మహేశ్వరుని ఎవరైతే నిత్యం తలుస్తుంటారో వారికి ఎటువంటి ఆపదలూ కలుగవు. సర్వ సౌభాగ్యాలూ సిద్ధిస్తాయి. పరమేశ్వరుడు భక్తజన సులభుడు. ఆ స్వామిని ఒక్కసారి తలిస్తే చాలు. ఎంతో ఆనందిస్తాడు. నిర్మల మనస్సుతో పరమేశ్వరుని ఆరాధించినవారికి అన్ని దుఃఖాలనుండి విముక్తి కలుగుతుంది. శివ భక్తులను నవగ్రహాలు బాధపెట్టవు. ఎల్లప్పుడూ పరమేశ్వరుని స్మరించేవారికి ఏ గ్రహ బాధలూ ఉండవు.

ఆ శ్రీనివాసుని దయవలన నేను ఇప్పటిదాకా ఆ స్వామి లీలలపై పదహారు పుస్తకాలు రచించడం జరిగింది. ఆ పుస్తకాలన్నీ దేశ విదేశాలలోని భక్తులచేత నిత్యం పఠింపబడటం ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకాలు చదివిన ప్రతి వారికీ ఎన్నో శుభాలు జరుగుతున్నాయి. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో వీరందరూ ఎంతో సుఖంగా జీవిస్తున్నారు. ఈ రచనలన్నిటిలో శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం, శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతకల్పం, శ్రీ ఆనంద ఆంజనేయం, భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ మూడు వ్రతాలు నిత్యం ఎందరో భక్తుల గృహాలలోను, ఎన్నో ఆలయాలలోను ఆచరింపబడుతున్నాయి. ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది?

ఆ పరమేశ్వరుని అనుగ్రహంతో ఈ శ్రీ మహేశ్వర వ్రతం రచించగలిగాను. నేను రాసిన ప్రతీ పుస్తకం వెనుక స్వామివారి లీలలు ఎన్నో చూశాను. అలాగే ఈ మహేశ్వర వ్రతం రాస్తున్నప్పుడు కూడా ఎన్నో విశేషాలు జరిగాయి. పుస్తకం రాయడం

మొదలుపెట్టగానే అనుకోకుండా శంకరమఠంలో శ్రీ చంద్రమౌళీశ్వరస్వామిని దర్శించటం జరిగింది. అటు తరువాత వరుసగా మరొక రెండు అద్భుతమైన శ్రీ పరమేశ్వర ఆలయాలను దర్శించాను. ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం ఈశ్వరానుగ్రహమే. ఈ పుస్తకం రాస్తున్నన్ని రోజులు ఆ పరమేశ్వరుని ప్రియకుమారుడైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు చిన్న బాలుని రూపంలో ఎదురుగా చిరునవ్వుతో దర్శనమివ్వడం జరిగింది. ఆ అద్భుత దృశ్యం ఇప్పటికీ నా కనులముందు మెదులుతూ ఉంటుంది. అతి సామాన్యుడనైన నాకు ఇంతటి అనుగ్రహాన్ని ప్రదర్శించిన ఆ దేవతలందరికీ నా నమస్కారములు. మరొక విశేషం ఈ పుస్తకం డి.టి.పి. చేయటం కూడా అనుకోకుండా మహేశ్వరుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రంలో ప్రారంభమవటం ఆ స్వామి అనుగ్రహంగా తలుస్తున్నాను.

ఈ పుస్తకాన్ని చక్కగా డి.టి.పి. చేయించి అచ్చు వేయించిన శ్రీ వాసవీ ప్రింటర్స్ శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు ఆ శ్రీ ఉమామహేశ్వరుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తక ప్రథమ ముద్రణకి సహకరించిన శ్రీ కాటంరెడ్డి శివకుమార్‌రెడ్డి, శ్రీమతి గిరిజ గార్లకు (గౌతమి విద్యాధామం, హైదరాబాద్) నా కృతజ్ఞతలు. ఇదంతా కూడా కేవలం స్వామివారి ప్రేరణ అనుకుంటున్నాను. వీరికి, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ ఉమామహేశ్వరుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ వ్రతకల్పం ఆచరించిన మీకు, వ్రత కథలు విన్నవారికి, ప్రసాదం స్వీకరించినవారికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీ ఉమామహేశ్వరులను ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః

**శ్రీ ఉమామహేశ్వర కటాక్ష సిద్ధిరస్తు**

**సమస్త సన్మంగాళానిభవంతు ః**

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

హైదరాబాద్.

04-08-2013

## ఈ వ్రతం ఎలా ఆచరించాలి?

- ఈ పుస్తకాన్ని ఎవ్వరైనా, ఎప్పుడైనా, వయసుతోగానీ, కులంతోగానీ నిమిత్తం లేకుండా పఠించవచ్చును. స్త్రీ, పురుష భేదం లేదు, ఏ నెలలోనైనా, ఏ రోజులలోనైనా చదువవచ్చును. ఏకాదశి, పౌర్ణమి తిథులందు గానీ, ఆరుద్ర నక్షత్రంనాడు కానీ పఠిస్తే మరింత శుభప్రదం. సోమవారంనాడు చదివితే చాలా మంచిది. కార్తీక సోమవారాలందు ఈ వ్రతం ఆచరిస్తే జన్మజన్మల పాపాలు నశిస్తాయి. ఎంతో పుణ్యఫలం కలుగుతుంది. ఈ వ్రతం ఆచరించే రోజున ఉపవాసం తప్పక ఉండాలనే నియమం లేదు.

- ఈ వ్రతం ఆచరించేముందు ఒక్కసారి మనస్సులోనే గణపతికి, నవగ్రహదేవతలకు, అష్టదిక్పాలకులకు నమస్కరించవలెను. అటుతరువాత మీ పేరు, మీ కుటుంబ సభ్యుల పేర్లు, గోత్రం మనస్సులో తలచుకొని వ్రతం మొదలుపెట్టవలెను. శ్రీ పార్వతీ పరమేశ్వరుల అష్టోత్తర నామాలు పఠించాలి. శ్రీ స్వామివారి అథాంగపూజ చేసి తరువాత ఈ పుస్తకంలోని ఐదు కథలను చదివి స్వామివారికి ఏ ఫలమునైనా నివేదింపవచ్చును.

- ఈ వ్రతం ఆచరించేటప్పుడు భార్య, భర్తలు ఇద్దరూ తప్పక కలిసి ఆచరించాలనే నియమం లేదు. భర్తకు వీలున్నప్పుడు భర్త, భార్యకు వీలున్నప్పుడు భార్య, ఇలా ఎవరి వీలును బట్టి వారు ఆచరించవచ్చును. వీలున్నప్పుడు ఇద్దరూ కలిసి ఆచరింపవచ్చును.

- దురదృష్టవశాత్తు భార్యను కోల్పోయిన పురుషులు కానీ, భర్తను కోల్పోయిన స్త్రీలు కాని కూడా నిరభ్యంతరంగా ఈ వ్రతం ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించినవారికి పూర్తి మనశ్శాంతి కలుగుతుంది.

- ప్రతి సోమవారం ఈ పుస్తకంలోని ఐదు కథలను చదివి స్వామికి అరటిపండ్లనుగానీ, జామపండ్లను గానీ నైవేద్యం పెట్టి స్వీకరిస్తే ఎటువంటి అనారోగ్యమైనా వెంటనే తొలగిపోతుంది. ఎటువంటి ఆపదలూ కలుగవు, అపమృత్యుభయం ఉండదు. చదివే శక్తిలేనివారికి, వారి

బంధువులెవరైనా చదివి వినిపించినా, ఎంతో ఫలం కలుగుతుంది.

➩ ప్రతీ సోమవారం పరమేశ్వరుని ఆలయంలో అర్చకులచేత ఈ పుస్తకం పఠించబడితే ఆ ఆలయాలు మహా మహిమాన్వితమైన దివ్యక్షేత్రాలుగా పేరొందుతాయి. అక్కడకు వచ్చే భక్తులందరికీ పరమేశ్వరుని అనుగ్రహం కలిగి సుఖశాంతులతో జీవిస్తారు.

➩ శ్రీ పరమేశ్వరుని జ్యోతిర్లింగ క్షేత్రాలలోకానీ, ఏ దివ్యక్షేత్రంలోనైనా ఈ వ్రతం ఆచరిస్తే కొన్ని కోట్ల జన్మల పాపఫలం నశిస్తుంది. వ్రతం ఆచరించిన వెంటనే శరీరంలోని రోగాలన్నీ తొలగిపోతాయి. శరీరానికి నూతన తేజస్సు కలుగుతుంది. దీర్ఘాయుష్షుతో సుఖంగా జీవిస్తారు.

➩ సంతానం లేనివారు స్వామివారి ఆలయంలో సోమ, మంగళ, బుధవారాలలో వరుసగా మూడు రోజులు ఈ పుస్తకం పఠిస్తే తప్పక చక్కటి సంతానం కలుగుతుంది. వివాహం కాని కన్యలు కానీ, యువకులు కానీ, ఈ విధంగా చదివితే త్వరలో వివాహం జరుగుతుంది.

➩ దూరదేశాలలో ఉండే మీ పిల్లల నిమిత్తం, మీ బంధువుల నిమిత్తం మీరు కూడా చదువవచ్చును. వారికి సంతానం, వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం కొరకు ఈ పుస్తకాన్ని సోమవారం నుంచి మూడు రోజులు శివాలయంలో చదివితే వెంటనే ఫలితం కలుగుతుంది.

➩ వీలున్నప్పుడు ఈ వ్రతం పురోహితుని సహకారంతో ఆచరిస్తే మంచిది. కలశస్థాపన చేసి అష్టదిక్పాలకులను, నవగ్రహదేవతలను, లోకపాలకులను మండపంపై ఆయా దిక్కులలో ఆవాహన చేసి పూర్తి విధానంతో ఈ వ్రతం చేస్తే శుభప్రదం.

ఈ విధంగా ఏ రీతిలోనైనా, ఏ రోజైనా, ఈ పుస్తకం పఠించి పరమేశ్వరుని అనుగ్రహం పొందవచ్చు.

– తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

## అధాంగపూజ

| | |
|---|---|
| ఓం శంకరాయ నమః | పాదౌపూజయామి |
| ఓం శివాయ నమః | జంఘేపూజయామి |
| ఓం మహేశ్వరాయ నమః | జానునీపూజయామి |
| ఓం త్రిలోకేశాయ నమః | ఊరూపూజయామి |
| ఓం వృషభారూఢాయ నమః | గుహ్యంపూజయామి |
| ఓం భస్మోద్ధూళిత విగ్రహాయ నమః | కటింపూజయామి |
| ఓం మృత్యుంజయాయ నమః | నాభింపూజయామి |
| ఓం రుద్రాయ నమః | ఉదరంపూజయామి |
| ఓం సాంబాయ నమః | హృదయం పూజయామి |
| ఓం భుజంగ భూషణాయ నమః | హస్తౌ పూజయామి |
| ఓం సదాశివాయ నమః | భుజౌ పూజయామి |
| ఓం విశ్వేశ్వరాయ నమః | కంఠం పూజయామి |
| ఓం గిరీశాయ నమః | ముఖంపూజయామి |
| ఓం త్రిపురాంతకాయ నమః | నేత్రాణిపూజయామి |
| ఓం విరూపాక్షాయ నమః | లలాటంపూజయామి |
| ఓం గంగాధరాయ నమః | శిరః పూజయామి |
| ఓం జటాధరాయ నమః | మౌళిం పూజయామి |
| ఓం పశుపతయే నమః | సర్వాణ్యంగాని పూజయామి |

శ్రీ పరమేశ్వర సర్వాణ్యంగాని పూజాం సమర్పయామి

శుద్ధ స్పటికం సంకాశం నాగాభరణభూషితాం

వేదవేదాన్తతత్వజ్ఞం వందే శంభుముమాపతిం ॥

# శ్రీ శివాష్టోత్తర శతనామావళిః

ప్రతి నామమునకు ముందు 'ఓం' అనియు చివర 'నమః' అనియు పూజించవలెను.

శివాయ నమః
మహేశ్వరాయ
శంభవే
పినాకినే
శశిశేఖరాయ
వామదేవాయ
విరూపాక్షాయ
కపర్దినే
నీలలోహితాయ
శంకరాయ
శూలపాణయే
ఖట్వాంగినే
విష్ణువల్లభాయ
శిపివిష్టాయ
అంబికానాథాయ
శ్రీ కంఠాయ
భక్తవత్సలాయ
భవాయ
శర్వాయ
త్రిలోకేశాయ
శితికంఠాయ
శివాప్రియాయ
ఉగ్రాయ
కపాలినే
కౌమారయే
అంధకాసుర సూదనాయ
గంగాధరాయ
లలాటాక్షాయ
కాలకాలాయ
కృపానిధయే
భీమాయ
పరశుహస్తాయ
మృగపాణయే
జటాధరాయ
కైలాసవాసినే
కవచినే
కఠోరాయ
త్రిపురాంతకాయ
వృషాంకాయ
వృషభారూఢాయ
భస్మోద్ధూళిత విగ్రహాయ
సామప్రియాయ
సర్వమయాయ
త్రయీమూర్తయే
అనీశ్వరాయ
సర్వజ్ఞాయ
పరమాత్మనే
సోమసూర్యాగ్ని లోచనాయ
హవిషే
యజ్ఞమయాయ
సోమాయ
పంచవక్త్రాయ
సదాశివాయ
విశ్వేశ్వరాయ
వీరభద్రాయ
గణనాథాయ
ప్రజాపతయే
హిరణ్యరేతసే
దుర్ధర్షాయ
గిరీశాయ
గిరిశాయ
అనఘాయ
భుజంగ భూషణాయ
భర్గాయ
గిరిధన్వయే
గిరిప్రియాయ
కృత్తివాససే
పురారాతయే
భగవతే
ప్రమథాధిపాయ
మృత్యుంజయాయ
సూక్ష్మతనవే
జగద్వ్యాపినే
జగద్గురవే
వ్యోమకేశాయ
మహాసేన జనకాయ
చారువిక్రమాయ
రుద్రాయ
భూతపతయే
స్థాణవే
అహిర్బుధ్న్యాయ
దిగంబరాయ
అష్టమూర్తయే
అనేకాత్మయే
సాత్త్వికాయ
శుద్ధ విగ్రహాయ
శాశ్వతాయ
ఖండపరశవే
అజాయ
పాశవిమోచకాయ
మృడాయ
పశుపతయే
దేవాయ
మహాదేవాయ
అవ్యయాయ
హరయే
పూషదంతభిదే
అవ్యగ్రాయ
దక్షాధ్వర హరాయ
హరాయ
భగనేత్రభిదే
అవ్యక్తాయ
సహస్రాక్షాయ
సహస్రపాదే
అపవర్గప్రదాయ
అనంతాయ
తారకాయ
పరమేశ్వరాయ
గంగాపతయే
నీలకంఠేశ్వరాయ

శ్రీ శివాష్టోత్తర శతనామావళిః సమాప్తము

# శ్రీ పార్వతీ అష్టోత్తర శతనామావళిః

ప్రతి నామమునకు ముందు 'ఓం' అనియు చివర 'నమః' అనియు పూజించవలెను.

పార్వత్యై
మహాదేవ్యై
జగన్మాత్రే
సరస్వత్యై
చండికాయై
లోకజనన్యై
సర్వదేవాధిదేవతాయై
గౌర్యై
పరమాయై
ఈశాయై
నగేంద్రతనయాయై
సత్యై
బ్రహ్మచారిణ్యై
శర్వాణ్యై
దేవమాత్రే
త్రిలోచన్యై
బ్రహ్మణ్యై
వైష్ణవ్యై
రౌద్ర్యై
కాళరాత్ర్యై
తపస్విన్యై
శివదూత్యై
విశాలక్ష్యై
చాముండాయై
విష్ణుసోదర్యై
చిత్కళాయై
చిన్మయాకారాయై
మహిషాసురమర్దన్యై
కాత్యాయన్యై
కాలరూపాయై
గిరిజాయై
మేనకాత్మజాయై
భవాన్యై
శ్రీమాత్రే
మహాగౌర్యై
రమాయై
రామాయై
శుచిస్మితాయై
బ్రహ్మస్వరూపిణ్యై
రాజ్యలక్ష్యై
శివప్రియాయై నారాయణ్యై
మహాశక్త్యై
నవోఢాయై
భాగ్యదాయిన్యై
అన్నపూర్ణాయ్యై
సదానందాయై
యౌవనాయై
మోహిన్యై
అజ్ఞానశుద్ధ్యై
జ్ఞానగమ్యాయై
నిత్యాయై
నిత్యస్వరూపిణ్యై
కమలాయై
కమలాకారాయై
రక్తవర్ణాయై
కళానిధయే
మధుప్రియాయై
కళ్యాణ్యై
కరుణాయై
జనస్థానాయై
వీరపత్న్యై
విరూపాక్ష్యై
వీరాధితాయై
హేమాభాసాయై
సృష్టిరూపాయై
సృష్టిసంహార కారిణ్యై
రంజనాయై
యౌవనాకారాయై
పరమేశప్రియాయై
పరాయై
పుష్టిణ్యై
పుష్పాకారాయై
పురుషార్థప్రదాయిన్యై
మహారూపాయై
మహారౌద్ర్యై
కామాక్ష్యై
వామదేవ్యై
వరదాయై
భయనాశిన్యై
వాగ్దేవ్యై
వచన్యై
వారాహ్యై
విశ్వతోషిణ్యై
వర్దనీయాయై
విశాలాక్షాయై
కులసంపత్ప్రదాయిన్యై
ఆర్తదుఃఖచ్ఛేదదక్షాయై
అంబాయై
నిఖిలయోగిన్యై
సదాపురస్థాయిన్యై
తరోర్మూలతలంగతాయై
హరవాహసమాయుక్తాయై
మునిమోక్షపరాయణాయై
ధరాధరభవాయై
ముక్తాయై
పరమంత్రాయై
కరప్రదాయై
కళ్యాణ్యై
వాగ్భవ్యై
దేవ్యై
క్లీం కారిణ్యై
సంవిదే
ఈశ్వర్యై
హ్రీంకార బీజాయై
శాంభవ్యై
ప్రణవాత్మికాయై
శ్రీ మహాగౌర్యై
శుభప్రదాయై

శ్రీ పార్వతీ అష్టోత్తర శతనామావళిః సమాప్తము

# లింగాష్టకమ్

బ్రహ్మమురారి సురార్చిత లింగం
నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజదుఃఖ వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

దేవముని ప్రవరార్చిత లింగం
కామదహన కరుణాకర లింగం
రావణదర్ప వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

సర్వసుగంధ సులేపిత లింగం
బుద్ధివివర్ధన కారణ లింగం
సిద్ధసురాసుర వందిత లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

కనకమహామణి భూషిత లింగం
ఫణిపతి వేష్టిత శోభిత లింగం
దక్షసుయజ్ఞ వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

కుంకుమచందన లేపిత లింగం
పంకజహార సుశోభిత లింగం
సంచిత పాపవినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

దేవగణార్చిత సేవిత లింగం
భావైర్భక్తిభి రేవచ లింగం
దినకరకోటి ప్రభాకర లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

అష్టదళోపరి వేష్టిత లింగం
సర్వసముద్భవ కారణలింగం
అష్టదరిద్ర వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

సురగురు సురవర పూజిత లింగం
సురవరపుష్ప సదార్చిత లింగం
పరమపదం పరమాత్మక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగమ్

లింగాష్టక మిదం పుణ్యం యఃపఠేచ్ఛివ సన్నిధౌ
శివలోక మవాప్నోతి శివేన సహమోదతే

**ఓం త్రయంబకమ్ యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్**
**ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్**

# శ్రీ మహేశ్వర వ్రతం

## మొదటి అధ్యాయం

### శివశర్మ దివ్య కథ

శ్రీ పరమేశ్వరుడు భక్తవత్సలుడు. ఆశ్రితజన పక్షపాతి. రోజులో ఒక్కసారైనా ఓంనమఃశ్శివాయ అంటే చాలు. సర్వ శుభాలు కలుగుతాయి. ఆ స్వామి నామాన్నే ప్రతీ రోజు స్మరించేవారికి సర్వ ఐశ్వర్యాలు లభిస్తాయి. ఎటువంటి ఆపదలూ దరిచేరవు. అపమృత్యు భయం ఉండదు. భక్త సులభుడైన ఆ మహేశ్వరుడే తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి అనే భక్తునికి ఈ వ్రతం అనుగ్రహించారు. ఈ వ్రతం నిర్మల మనస్సుతో, స్వామినే స్మరిస్తూ ఆచరించినవారికి పరమేశ్వరుని అనుగ్రహం కలుగుతుంది. సర్వశుభాలూ కలుగుతాయి.

పూర్వకాలంలో కావేరీనదీ తీరంలో శివశర్మ అనే పరమేశ్వరుని మహా భక్తుడు ఉండేవాడు. అతడు ఎన్నో శాస్త్రాలలో, ఎంతో ప్రావీణ్యత సంపాదించినవాడై చుట్టుప్రక్కల గ్రామాలలో తనకు మించిన పండితుడు లేడని పేరు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా జ్యోతిష, వ్యాకరణ శాస్త్రాలలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ మంచి వరులతో వివాహం జరిగింది. ఇదంతా ఆ పరమేశ్వర అనుగ్రహంగా తలచేవాడు. అతని భార్య సుమతి కూడా భర్తకు చేదోడు వాదోడుగా ఉండేది.

ప్రతీ ఏకాదశినాడు శివశర్మ ఏకాదశ రుద్రాభిషేకం చేసేవాడు. ఆనాడు ఇంటికి వచ్చిన బంధువులకు, స్నేహితులకు ఆ దంపతులు భోజనం పెట్టకుండా పంపేవారు కాదు. ప్రతీక్షణం శివశర్మ దంపతులు ఆ పరమేశ్వరునే స్మరిస్తూ కాలం గడపసాగారు. ఇంతలో ఒక్కసారిగా శివశర్మకు ఏదో కంటివ్యాధి వచ్చి చూపు సరిగా కనిపించటం

మానివేసింది. ఎన్ని రకాల మందులు వాడినా ఫలితం లేకపోయింది. రోజురోజుకి కంటిచూపు ఇంకా మందగించసాగింది. చూపు సరిగా కనపడక ఒకనాడు కాలికి ఏదో వస్తువు తగిలి పడటంతో మోకాలు విరిగి రెండు నెలలు మంచం మీదనే ఉండవలసి వచ్చింది.

ఎప్పుడూ ఆ పరమేశ్వరునే స్మరించే తమకు ఇన్ని బాధలు ఎందుకు వచ్చాయా అని ఆ దంపతులు ఎంతో కృంగిపోయారు. పరమేశ్వరా! ఏమిటీ ప్రారబ్ధం? ఎందుకు మాకు ఇన్ని బాధలు తండ్రీ అని పదే పదే మొరపెట్టారు. ఎంతటి వారికైనా పూర్వ జన్మ పాపఫలం అనుభవింపక తప్పదు కదా! కానీ పరమేశ్వరుడు దయామయుడు. శివశర్మ పాపఫలం తీరడంతో తన భక్తుని ఇంక రక్షించాలని తలచాడు. మరునాడు ఉదయం వారింటికి సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపంలో వచ్చాడు. శివశర్మ దంపతులకు ఆ బ్రాహ్మణునిలో ఏదో దివ్య తేజస్సు కనిపించింది. ఆ దంపతులిద్దరూ ఆ బ్రాహ్మణునికి నమస్కరించి ఇలా అన్నారు. స్వామీ! తమరు దివ్య తపఃసంపన్నులులాగా ఉన్నారు. నాయందు దయ తలచి ఈ బాధలనుండి విముక్తి పొందే మార్గం శెలవియ్యండి అని ప్రార్థించారు.

అప్పుడు వృద్ధబ్రాహ్మణుని రూపంలో ఉన్న పరమేశ్వరుడు వారితో ఇలా అన్నాడు. నాయనలారా! మీ బాధ నేను గ్రహించాను. మీ బాధలన్నీ తొలగే ఉపాయం చెబుతాను. ఇక్కడికి ఒకరాత్రి ప్రయాణ దూరంలో శివగిరి అనే గుట్ట ఉన్నది. ఆ గుట్టపై వెలసిన పరమేశ్వరుడు మహా శక్తిసంపన్నుడు. మీరు త్వరలో వెళ్ళి ఆ స్వామిని దర్శించండి. ఆ స్వామి దివ్య దర్శనంతో మీ బాధలన్నీ వెంటనే తొలగిపోతాయి అని శెలవిచ్చాడు.

శివశర్మ భార్యతో కలిసి మరుసటివారమే బయలుదేరి శివగిరి ప్రాంతాన్ని చేరాడు. కొండమీదకు మెట్లు సరిగా లేవు. కొండ కూడా కొంచెం ఎత్తుగానే ఉంది. కంటిచూపు సరిగా కనపడక ఈ కాలినొప్పితో అసలు ఎక్కగలనా అని శివశర్మకు సందేహం వచ్చింది. కొండపైనుంచి కిందకు దిగుతున్న భక్తులను ఎన్ని మెట్లు ఉన్నాయని అడిగాడు. వారు శివశర్మ దంపతులతో దాదాపు వెయ్యి మెట్లు ఉన్నాయని రెండు గంటలకంటే ఎక్కువే సమయం పడుతుందని అన్నారు. శివశర్మకు ఎంతో బాధ కలిగింది. ఈ కాలినొప్పితో ఎలా ఎక్కగలనా అని తలచాడు. కానీ మనస్సులో ఆ వృద్ధ బ్రాహ్మణుడే కనబడుతున్నాడు. ఎలాగైనా ఎక్కాలని నిశ్చయించుకుని నెమ్మదిగా భార్యను ఆసరాగా చేసుకుని రొజుతూ, రొప్పుతూ కొండ ఎక్కసాగాడు. మెట్లు చాలా ఏటవాలుగా ఉండి ఎక్కడానికి కష్టంగా ఉన్నాయి.

శివశర్మ ప్రతీ పది మెట్లకి ఒకసారి కూర్చొనసాగాడు. అలా రెండు వందల మెట్లు ఎక్కేసరికి అతడిలో ఊపిరి పూర్తిగా పోయింది. ఇక ముందుకు వెళ్లలేనని తలచి ఉన్నచోటనే కూర్చొన్నాడు. అప్పుడు మెట్లు ఎక్కుతున్న భక్తుడు ఒకరు వీరిదగ్గరికి వచ్చి స్వామీ నాతో రండి. మీరు తేలికగా మెట్లు ఎక్కగలుగుతారు అని చెప్పి శివశర్మను చెయ్యిపట్టుకుని లేపాడు. శివశర్మకు ఆ భక్తుని చేయి తగలగానే ఒక్కసారిగా శరీరమంతా ఏదో విద్యుత్తు ప్రసరించినట్లయింది. అంతే! అతడి చేయి పట్టుకుని శివశర్మ వెయ్యిమెట్లు చకచకా ఎక్కేసాడు. కొండపైకి రాగానే ఎదురుగా కొద్ది దూరంలో పరమేశ్వరుని ఆలయం అద్భుతంగా దర్శనమిచ్చింది. శివశర్మ దంపతులు ఇద్దరూ కనులుమూసుకుని ఆలయంవైపు తిరిగి ఆస్వామికి నమస్కరించారు. అంతే! ఆశ్చర్యం. కనులు తెరవగానే శివశర్మ కంటివ్యాధి పూర్తిగా నయమయింది. కంటిచూపు మునుపటికంటే శక్తివంతంగా అనిపించింది. ఎంతో సంతోషపడుతూ ఆ పరమేశ్వరుని దంపతులిద్దరూ ఎన్నో విధాల స్తుతించారు. అప్పటివరకు తనను చేయి పట్టుకుని తీసుకునివచ్చిన భక్తుని కోసం ప్రక్కకి తిరిగి చూశారు. ఆశ్చర్యంగా అప్పటిదాకా వారితోనే ఉన్న భక్తుడు కనపడలేదు. ఆ చుట్టుప్రక్కలనే వెతికాడు. కానీ ఎక్కడా కనపడలేదు. అప్పుడు వారికి అర్థమైంది. ఆ పరమేశ్వరుడే ఆ భక్తునిరూపంలో వచ్చి తమను అనుగ్రహించాడని శివశర్మ దంపతులు గ్రహించారు.

ఆ దంపతులిద్దరూ కొండపై ఉన్న కోనేరులో స్నానం చేసి ఆలయంలో పరమేశ్వరుని దర్శించుకున్నారు. మహేశ్వరుని దర్శనంతో వారి పూర్వజన్మ పాపాలన్నీ నశించాయి. ఆ రాత్రి అక్కడే నిద్రచేసి మరునాడు తమ ఊరు తిరిగి వెళ్లిపోయారు. కొన్ని రోజులకు శివశర్మ కాలినొప్పి కూడా పూర్తిగా తగ్గిపోయింది. శివశర్మ దంపతులు బ్రతికినంత కాలం ఆ పరమేశ్వరుని సేవిస్తూ సుఖంగా గడిపి చివరన ముక్తిని పొందారు.

ఓం నమః పార్వతీ పతయే నమః

ఓం హర హర మహాదేవాయ నమః

# శ్రీ మహేశ్వర వ్రతం

## రెండవ అధ్యాయం

## శంకర భట్టు కథ

సృష్టి మొత్తానికి కారణభూతుడు పరమేశ్వరుడు. సమస్త దేవతాగణమూ ఆ పరమేశ్వరునే నిత్యం స్తుతిస్తూ ఉంటారు. రోజులో ఒక్కసారైనా పరమేశ్వరుని నామాన్ని తలచుకున్నా ఎన్నో జన్మల పాపాలు నశిస్తాయి. అందునా సంధ్యా సమయంలో శివనామస్మరణ చేసినవారికి ఎంతో పుణ్యఫలం కలుగుతుంది. ఈ సృష్టిమొత్తం వ్యాపించి ఉన్న ఆ పరమేశ్వరుని నిత్యం ప్రార్థించేవారికి సర్వశుభాలు కలుగుతాయి. సర్వ ఐశ్వర్యాలు లభిస్తాయి. ఎటువంటి అనారోగ్యం దరిచేరదు. బ్రతికినంతకాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందుతారు.

పూర్వకాలంలో కృష్ణా తీరంలో శంకరభట్టు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. తన ఊరిలోని వేద పాఠశాలలో పౌరోహిత్యం విద్యను నేర్చుకుని చుట్టుప్రక్కల గ్రామాలలో పౌరోహిత్య కార్యక్రమాలు నిర్వర్తిస్తూ ఉండేవాడు. ఎంతో సత్ప్రవర్తనతో జీవిస్తూ ఉండేవాడు. భార్యా, ఇద్దరు కుమారులతో సుఖంగా ఉండేవాడు. నిత్యం ఆ భగవన్నామస్మరణలో గడుపుతూ ఉండేవాడు. పౌరోహిత్యంలో మంచిపేరు రావడంతో సంపాదన కూడా బాగా పెరగసాగింది. ఇంతలో అతడికి యాభై సంవత్సరాల వయస్సు వచ్చింది. ఎంతో ధనం సంపాదించడం చేత అతడిలో అహంకారం పెరిగింది. దాంతో దైవభక్తి సన్నగిల్లింది. అనేక చెడు అలవాట్లకు లోనయ్యాడు. ఒకప్పుడు ఎంతో పేరుగల శంకరభట్టు అనేక వ్యసనాల బారినపడి చివరకు భార్య, పిల్లలచేత కూడా అసహ్యించుకోబడే

పరిస్థితికి వచ్చాడు. ఉన్న వ్యసనాలతోపాటు పరస్త్రీ వ్యామోహం కూడా ఎక్కువవడంతో ఊరివారందరూ కలిసి అతడికి గ్రామబహిష్కరణ శిక్ష విధించారు.

ఊరినుంచి బహిష్కరింపబడ్డ శంకరభట్టు ఆ ఊరు, ఈ ఊరు తిరుగుతూ అనారోగ్యం పాలై భిక్షమెత్తుకుని జీవింపసాగాడు. అలా ఒక్కొక్క ఊరిలో కొన్ని రోజులు గడుపుతూ కొన్ని రోజులకు మరో ఊరు చేరుకునేవాడు. ఒకనాడు ఉన్న ఊరినుంచి బయలుదేరి వెళుతూ మధ్యలో అరణ్యమార్గంలో చిక్కుకున్నాడు. ఎటుచూసినా కటిక చీకటి. దారి తెలియక తికమక పడ్డాడు. ఒక చెట్టుకింద నిద్రపోయాడు. రాత్రంతా అడవిమృగాల అరుపులతో నిద్ర సరిగా పట్టలేదు. ఉదయం లేవగానే నడక తిరిగి ప్రారంభించాడు. నీరసంగా ఉండటంచేత ఎక్కువ దూరం నడవలేకపోయాడు. ఇంతలో సాయంత్రమై చీకటి పడింది. ఒంట్లో ఓపిక నశించి ఇంక మరణం తప్పదని తలచాడు.

అప్పుడు శంకరభట్టుకి ఒక పాత భవనం కనపడింది. ఆ భవనం అంతా పాడుపడి శిథిలావస్థలో ఉంది. అందులో చిన్న చిన్న గదులు అనేకం ఉన్నట్టు కనపడ్డాయి. నెమ్మదిగా ఒక గదిలోకి ప్రవేశించాడు. ఆ రాత్రికి అక్కడ పడుకుందామని తలచాడు. అంతా దుమ్ము, ధూళితో ఉంది. కాలికి ఎన్నో ముళ్ళు, ఆకులు తగులుతున్నాయి. అక్కడ నిద్రించటంకోసం ఆ స్థలమంతా శుభ్ర పరచుకున్నాడు. చీకటిలో కాలికి తగులుతున్న ఆకులను పక్కగా విసిరేశాడు. అంతా కటిక చీకటి. ఆ భవనం ఏమిటో కూడా తెలియటం లేదు.

నిద్ర పోదామని ఎంత ప్రయత్నించినా శరీరంలో ఓపిక నశించి నిద్ర కూడా పట్టలేదు. ఇంతలో తెల్లవారింది. అతడికి ఎదురుగా ఒక్కసారి పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. శంకరభట్టుతో ఇలా అన్నాడు. నాయనా! శంకరభట్టు నీవు ఇంతకుముందు ఎన్నో పాపాలు చేశావు. కానీ నిన్నరాత్రి తెలియక చేసిన నీ పనులవలన నేను ఎంతో ప్రసన్నుడనైనాను. నిన్న నాకు అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి పర్వదినం. నువ్వు అడుగుపెట్టిన ఈ ప్రదేశం మహేశ్వరం అనే పేరుతో ఒకప్పుడు ఎంతో విరాజిల్లింది. ఇంతకాలం ఎవరూ పట్టించుకొనక ఇలా శిథిలావస్థలో ఉంది. ఇన్ని సంవత్సరాల తర్వాత నీవు దానిని శుభ్రపరచే ప్రయత్నం చేశావు. అంతేకాదు ఎప్పటినుండో కిందపడివున్న బిల్వ దళాలను నీకు తెలియకుండానే ఒక ప్రక్కనున్న నా శివలింగంపై విసిరావు. మహాశివరాత్రినాడు ఉపవాసం ఉండి, నా ఆలయం శుభ్రం చేసి బిల్వ దళాలతో నన్ను అర్చించిన భాగ్యం నీకు దక్కింది. ఈ క్షణం నుంచి అన్ని

ఐశ్వర్యాలను నీకు ప్రసాదిస్తున్నాను. ఒక్కసారి కనులు మూసుకుని నన్ను ప్రార్థించు అని ఈశ్వరుడు అంతర్ధానమయ్యాడు. కనులు తెరచిన ఈశ్వరభట్టు తన గ్రామంలో ఉన్నాడు. ఇదంతా ఆ మహేశ్వర మహిమగా గ్రహించాడు. ఎటువంటి అనారోగ్యం లేదు. ఎంతో ఐశ్వర్యం లభించింది. జరిగినదంతా భార్యా, పిల్లలకు, ఊరివారికి చెప్పాడు. అటుతరువాత శంకర భట్టు ఎటువంటి దుర్వ్యసనాలకు లోనుకాకుండా, ఎన్నో సత్కార్యాలు చేస్తూ ఆ పరమేశ్వరుని సేవిస్తూ కాలం గడిపి చివరకు ఆ మహేశ్వరునిలోనే ఐక్యమైనాడు.

పరమేశ్వరుడు అంతటి దయామయుడు. తెలియకుండానే తనను కొలచిన శంకరభట్టును ఎంతగానో అనుగ్రహించాడు. ఇక తెలిసి చేసే శివపూజ వలన ఎంత పుణ్యఫలం లభిస్తుందో చెప్పనలవి కాదు. పరమేశ్వరుడు అల్ప సంతోషి. ఒక్కసారి తన నామం స్మరించినా, సమస్త ఐశ్వర్యాలను అనుగ్రహిస్తాడు. మంగళకరుడు, శుభప్రదుడు, ముక్తిప్రదాత అయిన పరమేశ్వరునికి ఇవే మన నమస్కారములు.

ఓం నమః పార్వతీ పతయే నమః

ఓం హర హర మహాదేవాయ నమః

# శ్రీ మహేశ్వర వ్రతం

## మూడవ అధ్యాయం

## శివదాసుని కథ

పరమశివుడు ఎంతో దయామయుడు. తన భక్తులంటే స్వామికి ఎంతో ఆప్యాయత, అనురాగం. తనను నమ్మి కొలిచినవారు ఈ పధ్నాలుగు లోకాలలో ఎక్కడ ఉన్నా నిత్యం కంటికి రెప్పలా కాపాడే అమృతమూర్తి. పరమేశ్వరునికి తనను కొలిచే భక్తుడు బీదవాడా, ధనికుడా అనే బేధం లేదు. మనస్ఫూర్తిగా కొలిస్తే చాలు, అతడికి సర్వసంపదలూ అనుగ్రహిస్తాడు. ఈశ్వరుడు అంటే అమితమైన ఐశ్వర్యాన్ని ప్రసాదించేవాడు అని అర్థం. ఈశ్వర శబ్దం సకల శుభాలకూ సంకేతం.

పూర్వకాలంలో గోదావరీ తీరంలో శివదాసుడనే గొప్ప శివభక్తుడు ఉండేవాడు. అతడు ఏవో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం గడుపుతుండేవాడు. చిన్ననాటినుండి శివభక్తి పరాయణుడై ఎప్పుడూ శివనామాన్నే స్మరిస్తూ ఉండేవాడు. ఏ పని చేసినా పరమేశ్వరార్పణమస్తు అని తలచుకునేవాడు. ఆ స్వామిదయవలన శివదాసుకి ఆ ఊరి జమిందారు శేషయ్య ఇంట్లో గుమస్తా ఉద్యోగం దొరికింది. అందుకు శివదాసు ఎంతో సంతోషించి బ్రతికినంతకాలం ప్రతిరోజూ క్రమం తప్పక శివుని అభిషేకం చేస్తానని అనుకున్నారు. ఆ ప్రకారం ఆనాటినుండి ప్రతిరోజూ ఉదయమే లేచి శుభ్రంగా స్నానం చేసి తన ఇంట్లోని శివలింగానికి స్వచ్ఛమైన జలంతో అభిషేకం చేయడం ప్రారంభించాడు.

శివదాసు తనకు ఎన్ని పనులున్నా అభిషేకం మాత్రం మరిచేవాడు కాదు. ఎప్పుడైనా పనులవలన రాత్రి నిద్రపోవటం ఆలస్యమైనా తెల్లవారుఝామునే లేచి తప్పక అభిషేకం

చేయందే కాలు బయటపెట్టేవాడు కాదు. శరీరంలో ఎప్పుడైనా కొంచెం నలతగా ఉన్నా ఏమాత్రం లెక్కచేసేవాడు కాదు. అన్నింటికీ ఆ పరమేశ్వరుడే ఉన్నాడు అనేవాడు. శివదాసు అచంచలభక్తికి ఆ పరమేశ్వరుడు ఎంతో సంతోషపడి అతడి జీవితం సాఫీగా సాగిపోయేలా అనుగ్రహించాడు.

రోజులిలా జరుగుతుండగా ఒకనాటి రాత్రి పెద్ద గాలి, వాన వచ్చింది. రాత్రంతా కుంభవృష్టి కురుస్తూనే ఉంది. ఉదయానికి కూడా తగ్గలేదు. శివదాసు ఆ వర్షానికి కూడా లెక్కచేయకుండా కోనేటికి వెళ్ళి స్వచ్ఛమైన నీరు తీసుకువచ్చి శివునికి అభిషేకం చేసి ఆ తర్వాత నెమ్మదిగా జమీందారు ఇంటికి చేరాడు. వర్షం జోరుగా పడుతుండటంతో కొంచెం ఆలస్యమైంది. శివదాసుని చూస్తూనే జమీందారు గట్టిగా అరుస్తూ ఏరా! ఎందుకింత ఆలస్యమైంది, ఒకరోజు అభిషేకం చెయ్యకపోతే మీ శివుడు ఊరుకోడా. అంటూ నానామాటలు అన్నాడు. ఆ మాటలకు శివదాసు ఎంతో బాధపడ్డాడు.

జమీందారు ఈవిధంగా శివదాసుని ఎన్నో దుర్భాషాలాడటం గమనించిన పరమేశ్వరుడికి ఎంతో కోపం వచ్చింది. పరమశివుడు ఎంతటి భక్తవత్సలుడంటే తన భక్తులను ఎవ్వరైనా పల్లెత్తుమాట అన్నా ఊరుకోడు. ప్రతీనిత్యం తననే తలుస్తూ నిత్యం అభిషేకం నిర్వహించే శివదాసును ఆవిధంగా అన్నందుకు జమీందారుపై పరమేశ్వరునికి తీవ్ర ఆగ్రహం కలిగింది. ఆవిధంగా ఆ మహాశివుని ఆగ్రహానికి లోనైన జమీందారుకి మరునాడే తీవ్రమైన పక్షవాతం వచ్చి మాట పడిపోయింది. రెండు రోజులకు కాళ్ళు, చేతులు కూడా పడిపోయి మంచం పట్టాడు. కొద్దికాలానికి అతని ఐశ్వర్యం అంతా హరించింది. ఇలా ఎందుకు జరిగిందో అతడికి అర్థం కాలేదు.

ఒకనాడు ఆ ఊరికి ఒక సాధువు వచ్చాడు. ఆ సాధువు ఎన్నో మహిమలు కలవాడని, ఏ జబ్బులనైనా నయం చేయగలడని జనం చెప్పుకున్నారు. జమీందారు భార్య ఆ సాధువును కలసి ప్రాధేయపడితే అతడు దయతలచి జమీందారును చూడటానికి ఇంటికి వచ్చాడు. ఒక్కసారి కనులు మూసుకుని ధ్యానం చేసి జమీందారుతో ఇలా అన్నాడు. నాయనా! నీవు కొంతకాలం క్రితం నీ వద్ద పనిచేసే శివదాసుని అనవసరంగా దూషించావు. పరమేశ్వరునికి ఎంతో ప్రియభక్తుడైన అతడిని ఆవిధంగా దూషించటం వలన ఆ స్వామి ఆగ్రహానికి లోనయ్యావు. అందువలననే ఈ అనర్థాలన్నీ జరిగాయి అని చెప్పి జమీందారు భార్యవైపు తిరిగి అమ్మా! ఆ శివదాసుని రేపే మీ ఇంటికి పిలిచి అతని కాళ్ళు కడిగి పూజించమని అన్నాడు. అప్పుడు పరమశివుడు సంతోషిస్తాడని, మీ

బాధలన్నీ తొలగిపోతాయని చెప్పాడు.

ఆ మరుసటినాడే శివదాసుని జమీందారు దంపతులిద్దరూ వారింటికి పిలిపించి, తమ తప్పుని మన్నించమని వేడుకున్నారు. అతడి కాళ్ళు కడిగి ఆ నీటిని ఆ దంపతులిద్దరూ తలపై చల్లుకున్నారు. అంతే! జమీందారు అనారోగ్యం ఒక్కసారిగా మాయమైంది. సంపూర్ణ ఆరోగ్యంతో లేచి నిలుచున్నాడు. ఆ దంపతులిద్దరూ ఎంతో సంతోషపడి శివదాసునికి నమస్కరించి, ఆ పరమేశ్వరుని ఎన్నో విధాల స్తుతించారు. జమీందారు అటు తరువాత గొప్ప శివభక్తుడై, ప్రతినిత్యం పరమేశ్వరునికి అభిషేకం చేస్తూ కాలం గడిపాడు. ఆ ఊరిలో చక్కటి శివాలయం నిర్మించి, జీవించినంతకాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందాడు.

ఓం నమః పార్వతీ పతయే నమః

ఓం హర హర మహాదేవాయ నమః

# శ్రీ మహేశ్వర వ్రతం

## నాలుగవ అధ్యాయం

## గంగరాజు కథ

పరమేశ్వరుడు భక్త సులభుడు. రోజులో ఒక్కసారైనా పరమశివుని మనస్సులో తలిస్తే జీవితమంతా శుభప్రదంగా గడుస్తుంది. ఎటువంటి ఆపదలూ దరిచేరవు. అపమృత్యు భయం ఉండదు. సర్వశుభాలూ కలుగుతాయి. మనస్ఫూర్తిగా ఆ స్వామిని కొలిచేవారి ఇంట సిరులన్నీ కొలువై ఉంటాయి. దేనికీ లోటుండదు. జ్ఞానము, పాండిత్యము లభిస్తుంది. తలపెట్టిన కార్యాలన్నీ జయప్రదంగా నేరవేరుతాయి.

పూర్వకాలంలో గంగాతీరంలో గంగరాజు అనే చిన్న వ్యాపారస్తుండేవాడు. అతడు ఎన్నో చిన్న చిన్న వ్యాపారాలు చేసి కొద్ది కాలంలోనే ఎంతో ధనం సంపాదించాడు. అంత ధనం సంపాదించాడే కానీ, ఏ మాత్రం దానధర్మాలు చేసేవాడు కాదు. పరమ పిసినారిగా పేరొందాడు. కల్తీ వ్యాపారాలు చేసి ప్రజలను విపరీతంగా దోచుకునేవాడు.

అలా బ్రతికిన గంగరాజు కొన్ని సంవత్సరాల తరువాత మరణించి, తరువాత మరుజన్మలో ఆ పాపాల ఫలితంగా గుడ్డివానిగా జన్మించాడు. ఒక నిరుపేద కుటుంబంలో పుట్టుకతోనే కంటిచూపు లేకుండా జన్మించిన గంగరాజు చిన్నతనంలోనే తల్లితండ్రులను కోల్పోయాడు. ఏ ఆధారమూ లేక జోలె పట్టుకుని, ఆ వీధి, ఈ వీధి తిరుగుతూ అడుక్కుంటూ బ్రతికేవాడు. ఒక్కొక్క ఊర్లో కొన్ని నెలలు నివసించి, తరువాత మరోఊరు చేరేవాడు. అలా కొన్ని రోజుల తరువాత గంగరాజు లింగాలపల్లె అనే ఊరు చేరాడు. ఆ ఊరిలోని పరమేశ్వరుని ఆలయం ఎంతో మహా మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధిచెందింది. అంతేకాదు, ఆ ఊరిలో దాదాపు ప్రతీ చెట్టుకింద ఒక శివలింగం ఉండేది. పురాతన కాలంలో దేవతలే ఈ శివలింగాలను ప్రతిష్టించారని ఊరు ప్రజలు చెప్పుకునేవారు.

ఈ ఊరు చేరిన గంగరాజు ఒక పెద్ద చెట్టుకింద నివసిస్తూ ప్రతిరోజూ ఉదయం,

సాయంత్రం ఊళ్ళోకి వెళ్లి భిక్షాటన చేసి వచ్చేవాడు. దొరికినదానిని తింటూ కాలం గడిపేవాడు. ఒకరోజు ఉదయం అలా భిక్షాటనకు వెళ్ళిన గంగరాజుకు ఎవ్వరూ ఏ పదార్థాలూ అతడి పాత్రలో వెయ్యలేదు. సరే సాయంత్రం ఏదైనా దొరుకుతుందేమో అని అనుకున్నాడు. సాయంత్రం తిరిగి అన్నివీధులూ తిరిగాడు. కానీ, ఎవ్వరూ ఏ పదార్థమూ భిక్ష వేయలేదు. ప్రతిరోజూ ఏదో ఒకటి తనకు లభించేది. ఆ రోజు ఎవ్వరూ తనకు ఎందుకు భిక్ష వేయలేదో అర్థం కాలేదు. ఉదయం నుంచి ఏ ఆహారం లేకపోవడంవలన ఒంట్లో ఓపిక లేక తిరిగి తన చెట్టువద్దకు బయలుదేరాడు. ఒక్కసారిగా పెద్దవాన మొదలైంది. గంగరాజు తడసి ముద్దయ్యాడు. చివరకు ఒకచెట్టు కింద్రకు చేరాడు. తన పాత్రనిండా వర్షపు నీరు చేరడంతో నీటిని ప్రక్కకు విసిరాడు. అంతే! అప్పుడు ఒక అద్భుతం జరిగింది.

గంగరాజుకు ఒక్కసారిగా కంటిచూపు వచ్చింది. అంతేకాదు తన ప్రక్కనే బంగారు నాణేల మూట కనబడింది. ఎదురుగా పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. గంగరాజు ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. ఏమిటీ అద్భుతాలు అని తలుస్తుండగా పరమేశ్వరుడు ఇలా అన్నాడు. నాయనా! ఈరోజు నాకెంతో ప్రీతికరమైన సోమవారం. అందునా ఏకాదశి. ఊరి ప్రజలందరూ ఉపవాసం ఉండుటవలన నీకు ఏ పదార్థమూ లభించలేదు. అందువలన నీవు కూడా ఉపవాసం చేసినవాడివయ్యావు. అంతేకాదు, కనులు కనపడకుండా నీకు తెలియకుండా నీవు విసరిన నీ పాత్రలోని వర్షపునీరు పక్కన ఉన్న శివలింగంపై పడింది. ఆ విధంగా నీవు నాకు అభిషేకం చేసినవాడివయ్యావు. ఇంత పవిత్రదినాన ఉపవాసం ఉండి నాకు అభిషేకం చేసి ఎంతో పుణ్యం సంపాదించుకున్నావు. అందువలన నీకు చూపును ప్రసాదిస్తున్నాను. ఈ బంగారు నాణేలు తీసుకుని, ఏదైనా వ్యాపారం చేసుకుని సుఖంగా జీవించు. అని చెప్పి పరమేశ్వరుడు అంతర్థానమయ్యాడు.

జరిగినదానికి గంగరాజు ఎంతో సంతోషించి, ఆ ధనంతో వ్యాపారం మొదలుపెట్టి ఎంతో ధనం సంపాదించాడు. గొప్ప శివభక్తుడిగా పేరుపొంది ఎన్నో దాన ధర్మాలు చేసాడు. జీవించినంతకాలం సుఖంగా జీవించి, చివరన ముక్తిని పొందాడు. పరమేశ్వరుడు అల్ప సంతోషి, ఒక్క బిల్వదళంతో పూజించినా ఎంతో తృప్తి చెందుతాడు. సర్వ సంపదలూ అనుగ్రహిస్తాడు. చక్కటి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. అంతటి అమృతమూర్తి అయిన మహేశ్వరునికి ఇవే మన నమస్కారములు.

ఓం నమః పార్వతీ పతయే నమః

ఓం హర హర మహాదేవాయ నమః

# శ్రీ మహేశ్వర వ్రతం

## అయిదవ అధ్యాయం

# గోపాలుని దివ్య కథ

పరమేశ్వరుడు పరమదయాళువు, తననే నమ్మి కొలచేవారికి ఏ చిన్న ఆపద కలిగినా, తక్షణం రక్షించే అమృతమూర్తి. జీవితంలో ఒక్కసారి ఓం నమశ్శివాయః అంటే చాలు, అతడిని జీవించినంత కాలం కంటికి రెప్పలా కాపాడతాడు. ఆ స్వామి విశ్వపతి అనే భక్తునికి ఈ అయిదు కథలను అనుగ్రహించాడు. ఈ కథలను నిత్యం చదివేవారు తన అనుగ్రహానికి పాత్రులవుతారని ఆ స్వామి శెలవిచ్చాడు.

పూర్వకాలంలో ఏకనాథపురంలో గొప్ప శివాలయం ఉండేది. ఆ ఆలయంలో వెలసిన శివలింగాన్ని సాక్షాత్తూ దేవతలే ప్రతిష్టించారని చెప్పేవారు. ఆ స్వామి ఎంతో మహిమాన్వితునిగా చుట్టు ప్రక్కల గ్రామాలలో పేరుపొందాడు. భక్తులు బళ్ళు కట్టుకుని ఆ దేవాలయానికి వచ్చి పరమేశ్వరుని సేవించి వెళ్ళేవారు. ప్రతీ సంవత్సరం కార్తీకమాసంలో ఆ దేవాలయంలో అద్భుతమైన ఉత్సవాలు జరిగేవి. ఆలయాన్ని రంగు రంగుల పూలతో అలంకరించేవారు. ఎన్నో ప్రత్యేకపూజలు చేసేవారు.

ఆ ఆలయంలో భిక్షమయ్య అనే పూజారి వుండేవాడు. అతడు వేదాలన్నీ ఔపోసన పట్టినవాడని జనం చెప్పుకునేవారు. నమక, చమకాలతో నిత్యం పరమశివుని ఆరాధించేవాడు. అయితే తనకు అన్ని విద్యలూ తెలుసుననీ, ఎంతో గొప్ప పండితుననీ అతనికి కొంచెం అహంకారం ఉండేది. ఎంతటి వారికైనా అహంకారం తగదు కదా! పరమేశ్వరునికి ఇతడికి బుద్ధి చెప్పాలని అనిపించింది.

ఒకనాడు ఆలయంలో నిత్యం పూజ చేసే పాత్రలలోని ఒక చిన్న వెండిపాత్ర మాయమైంది. ఆలయమంతా ఎంత వెతికినా కనపడలేదు. ఆలయంలో గోపాలుడనేవాడు చిన్న చిన్న పనులు చేస్తూ కాలం గడిపేవాడు. ఆలయ ఆవరణంతా ఊడ్చి నీళ్ళు చిమ్మి కడిగేవాడు. ఏమీ చదువుకోకపోయినా ఎల్లప్పుడూ ఆ పరమేశ్వరునే ధ్యానిస్తూ కాలం గడిపేవాడు. భిక్షమయ్య ఈ గోపాలుడే ఆ గిన్నెలను దొంగిలించి ఉంటాడని తలచాడు.

సాయంత్రం వాడిని పిలిచి ఇదే విషయం గట్టిగా అడిగాడు. ఎంత గట్టిగా అడిగినా, తాను ఆ పని చెయ్యలేదని, తనకు అటువంటి ఉద్దేశ్యమే లేదని అన్నాడు. అయితే భిక్షమయ్య మాత్రం వాడు చెప్పిన మాటలు నమ్మలేదు. గట్టిగా అరిచి ఆవేశంతో ఊగిపోయాడు. పక్కన ఉన్న కఱ్ఱ తీసుకుని గోపాలుని గట్టిగా కొట్టాడు. ఎన్ని దెబ్బలు తిన్నా గోపాలుడు ఏ మాత్రం చలించక చేతులు కట్టుకుని తాను ఆ దొంగతనం చేయలేదని అన్నాడు. ఇక విసుగు వచ్చి భిక్షమయ్య ఇంటికి వెళ్ళిపోయాడు. గోపాలుడు తన మీద అనవసరంగా నింద పడినందుకు బాధ పడుతూ ఆ పరమేశ్వరునే తలుస్తూ నిద్రపోయాడు.

మరునాటి ఉదయం భిక్షమయ్య గర్భాలయం తలుపులు తీయగానే అక్కడ కనపడిన దృశ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు. శివలింగంపై అనేక చారలు కనబడ్డాయి. వెంటనే జరిగింది భిక్షమయ్యకు అర్థమైంది. తాను గోపాలున్ని కొట్టిన దెబ్బలన్నీ స్వామి తాను తీసుకున్నాడు. ఎంతటి మహా అపరాధం చేశాను అని తలచాడు. ఇంతలో పక్కనున్న పానవట్టంనుంచి ఒక ఎలుక ఆ గిన్నెను నోట కరుచుకుని వచ్చి అక్కడ వదిలి అంతే వేగంతో వెళ్ళిపోయింది. భిక్షమయ్యకు ఎంతో బాధ కలిగింది. గోపాలుని అనవసరంగా కొట్టానని, తన అపరాధం మన్నించమని ఆ పరమశివుని పరిపరివిధాలుగా వేడుకొన్నాడు. అటు తరువాత ఆ శివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేశాడు. గోపాలుడిని పిలిచి తన తప్పు క్షమించమని వేడుకున్నాడు.

పరమేశ్వరునికి కావలసింది పాండిత్యము, సర్వ శాస్త్రాలూ, తెలుసునన్న జ్ఞానమూ కాదు, ఇవన్నీ ఉన్నా అహంకారం ఉన్నట్లయితే ఆ స్వామి అనుగ్రహం కలుగదు. పరమేశ్వరునికి కావలసింది స్వచ్ఛమైన, నిర్మల భక్తి. ప్రశాంత చిత్తంతో నిష్కల్మష హృదయంతో ఆ స్వామిని రోజులో ఒక్కసారి తలచినా చాలు, ఆ స్వామి మనల్ని తప్పక అనుగ్రహిస్తాడు. అంతటి అమృతమూర్తి అయిన పరమేశ్వరునికి ఇవే మన నమస్కారములు.

ఓం నమః పార్వతీ పతయే నమః
ఓం హర హర మహాదేవాయ నమః

**శ్రీమహేశ్వర వ్రతం సమాప్తము**

మంగళమ్ భగవాన్ శంభో ! మంగళమ్ వృషభధ్వజ !
మంగళమ్ పార్వతీనాథ ! మంగళమ్ భక్తవత్సలా !

## మంగళహారతి

ఓం ఓం మంగళం । ఓంకార మంగళం
ఓం నమశివాయః మంగళం
న న మంగళం – నాకార మంగళం
నాగబిందు కళాతీత – దేవ మంగళం ॥ఓం॥
మః మా మంగళం । మకార మంగళం
మహాదేవ దయా సింధో – ఈశ మంగళం ॥ఓం॥
శి శీ మంగళం – శీకార మంగళం
సిద్ధ బుద్ధ రహిత – పరబ్రహ్మ మంగళం ॥ఓం॥
వా వా మంగళం – వకార మంగళం
వాద భేద రహిత – పరబ్రహ్మ మంగళం ॥ఓం॥
య యా మంగళం – యకార మంగళం
యధాతత్య పరిజ్ఞాన – వేద్య మంగళం ॥ఓం॥

ఓం మంగళం । ఓంకార మంగళం
ఓం నమః శివాయః మంగళం



మంగళమ్ భగవాన్ శంభో ! మంగళం వృషభ ధ్వజ !!

మంగళమ్ పార్వతీనాథ ! మంగళం భక్తవత్సలా !!



అనాయాసేన మరణం వినాదైన్యేన జీవనం
దేహాంతే తవసాయుజ్యం దేహిమే పార్వతీపతే

srivasaviprinters-9989277178